కథా కౌముది

# తొలిగిన మేఘాలు

తమిళ మూలం: జి. తిలకవతి I.P.S

తెలుగు అనువాదం: గౌరీ కృపానందన్




"ఈ రోజు ఎలాగైనా సరే, చచ్చిపోవాలి." కోకిల మనసులో దృఢంగా అనుకుంది. ఆత్మహత్య చేసుకునే వాళ్ళంతా ఎలా చేసుకుంటున్నారు? రైలు క్రిందపడి చచ్చిపోదామనుకుంటే ఆ ఊరిలో రైల్వే స్టేషను అసలే లేదు. దీనికోసం పద్దెనిమిది కిలోమీటర్లు వెళ్ళడం కుదురుతుందా? నిప్పంటించుకోవచ్చు. కాని చాలా చిత్రవధ. బాధ భరించలేక అరిస్తే ఎవరైనా వచ్చి కాపాడడానికి ఆస్కారం ఉంది. ఆలోచిస్తూ వాకిట్లో సాసుపు జల్లి ముగ్గు పెట్టింది కోకిల.

ముగ్గు పిండి డబ్బా ఒక చేత్తో పట్టుకుని, నడుములో దోపుకున్న లంగాను సరి చేసుకుంటూ నిటారుగా నిలబడిన కోకిలకి రెప్ప వాల్చకుండా తననే చూస్తున్న విద్య కనబడింది.

"కోకిలా! ఊరికే ఊరివాళ్ళని తప్పుపట్టడం ఏం న్యాయం? బంగారపు బొమ్మలాంటి రూపం, ఒత్తుగా, కృష్ణ సర్పంలా నిగనిగలాడే తలకట్టు, అందమైన చిత్రంలా తీర్చి దిద్దినట్లున్న ముఖంతో ఉన్న నిన్ను చూస్తుంటే.." విద్య ముఖంలో కించిత్తు గర్వంతో పాటు, గొంతులో అనురాగం కూడా తొణికిసలాడింది.

విని విని విసిగెత్తిపోయినట్లు "ప్చ్..." అంది కోకిల. తన అందం, రూపలావణ్యం గురించి ఎవరైనా పొగిడితే ఆమెకే తెలియని నిర్లిప్తత ఆవరించుకునేది. గత రెండేళ్ళగా అలాంటి పొగడ్తలు వింటుంటే ఒక విధమైన ద్వేషం కూడా ఏర్పడసాగింది.

"ఏమైంది రాణిగారికి? ఎందుకబ్బా అంత విరక్తి?" కోకిలని ఉడికిస్తూ చిలిపిగా అంది విద్య. అవడానికి అక్కయ్యే అయినా తల్లిలాగా చెల్లెలితో వ్యవహరించేది విద్య.

"ఏంటక్కా? నువ్వు కూడా ఇలా మాట్లాడుతున్నావు?" అంటుండగానే కోకిల కళ్ళలో నీళ్ళు నిండుకున్నాయి.

చిన్న పచారి కొట్టుకుని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న కుటుంబం వాళ్ళది. తండ్రి ఆరోగ్యంగా ఉన్నంత వరకు, పెద్దగా చెప్పుకునేటట్లుగా కాకున్నా చీకూ చింతాలేకుండా కాలం గడిచిపోయింది. కట్టుబాట్లలో లేని మధుమేహం, రక్తపోటు తండ్రిని ఇంట్లోనే కట్టిపడేసాయి. సరుకు కొనుగోలు చేయడానికి, గల్లా దగ్గర కూర్చుని వ్యాపారాన్ని చూసుకోవడానికి సరైన మనిషి దొరకక చాలా ఇబ్బందుల పాలైయ్యారు.

కుటుంబంలో విద్య మొదటి సంతానం. ప్లస్ టు ముగించి గత పదేళ్ళుగా పెళ్ళికోసం ఎదురు చూపులు చూస్తోంది. ఆమెకి అయిదేళ్ళు చిన్నవాడు గోపి. గోపికి ఎనిమిదేళ్ళు నిండినప్పుడు పుట్టింది కోకిల.

గోపి చదువు పాడైపోకూడదనేది ఇంట్లో వాళ్ళందరి ఉద్దేశం. ఏనాడు గడాపదాటని తల్లి పనివాళ్ళతో పచారి కొట్టును నడుపుతూ, ఇంటిని ఎలాగో ఒకలాగా నిర్వహిస్తూ వస్తోంది.

"ఊరికే దిగులు పడితే మాత్రం జరిగేదేముంది సుందరం? కల్యాణ ఘడియ వస్తే పెళ్ళికొడుకు తనంతటతానే వెతుక్కుంటూ వస్తాడు. అనవసరంగా దిగులు పడి ఆరోగ్యాన్ని పాడుచేసుకోకండి." డాక్టరు వచ్చిన ప్రతిసారి చిలక్కి చెప్పినట్లు సలహా చెప్పడం మానరు.

"విద్యని ఒక అయ్య చేతిలో పెడితే, ఆ బలమే ఆయన్ని లేచి కూర్చోబెడుతుంది. ఆ మాంగాడు తల్లి ఎప్పుడు కరుణిస్తుందో?" అమ్మ ప్రార్ధించుకోని రోజు లేదు.

ఎన్ని వ్రతాలు? ఎన్ని పూజలు చేసింది. రోజుల తరబడి శ్లోకాలు వల్లించింది. ఆఖరికి విసిగి వేసారి "అమ్మా! నన్ను వదిలెయ్యి. నాకు పెళ్ళీ పెటాకులు ఏమీ వద్దు" అంది.

జాతకరీత్యా ఏ దోషమూ లేని, ఏ అవకరమూ లేని విద్యకి ఇంకా వరుడు దొరక్కపోవడం గురించి బంధువులంతా చెవులు కొరుక్కున్నారు.

"ఇదిగో చూడండి. కట్నం పెద్ద విషయం కాదు. మీ అమ్మాయి విద్య చూడడానికి బాగానే ఉంది. కాదని చెప్పడం లేదు. కానీ అబ్బాయి మీ చిన్నమ్మాయిని ఇష్టపడుతున్నాడు."

ముందుగానే కూడబలుక్కున్నట్లు వచ్చిన వాళ్ళందరూ ఒకే పాఠం వల్లెవేశారు.

"ఒసే కోకిలా! ఈ రోజు మీ అక్కయ్యని చూడడానికి పెళ్ళివాళ్ళు వస్తున్నారని తెలుసుకదా? చెప్పింది జ్ఞాపకం ఉంచుకో. తగుదునమ్మా అంటూ వాళ్ళముందుకు రాకు. వాళ్ళు వచ్చి వెళ్ళేవరకు వంటింట్లోనో లేకపోతే పక్కింట్లోనో పడి ఉండు." అమ్మ ఆజ్ఞాపిస్తున్నట్లుగా అంది. కోకిల ముఖం చిన్నబోయింది. "సరేనమ్మా" అన్నది తగ్గు స్వరంలో.

పక్క గది నుంచి వేగంగా వచ్చింది విద్య. "అమ్మా! నువ్వు ఊరికే ఉండవా? ఇప్పుడు తనని ఎందుకు ఏడిపిస్తున్నావు?" అని తల్లిని కోపగించుకుంటూ కోకిల వైపు తిరిగింది. "పిచ్చిపిల్లా! ఇంత చిన్న విషయానికి ఎవరైనా ఏడుస్తారా? నువ్వు ఎక్కడికీ వెళ్ళక్కర్లేదు. ఎప్పటిలాగే నీ పనులు చూసుకో" ప్రేమతో అధికారం చెలాయిస్తున్నట్లుగా అంది.

ఒక్కొక్క సంబంధం తప్పిపోతున్నప్పుడు నాన్నగారి ఆరోగ్యం మరింత దిగజారసాగింది. ఇదంతా తనవల్లే అన్న అపరాధ భావం కోకిల మనస్సును మరింత వేధించసాగింది.

రూపంలో విద్యకన్నా తక్కువగా ఉన్న ఎంతో మంది ఆడపిల్లలు పెళ్ళై పిల్లా పాపలతో కళకళలాడుతున్నారు. చక్కగా సంసారాలు చేసుకుంటున్నారు. ఇక్కడ తనే పెద్ద సమస్యగా మారింది. వచ్చిన వాళ్ళంతా అక్కయ్యను తనతో పోల్చుకుని ఆమె తనకన్నా తక్కువగా కనిపిస్తున్న కారణం వల్లే ఆమెకి సంబంధం కుదరడం లేదు.

విద్యను పెళ్ళివాళ్ళు వద్దని తిరస్కరించి వెళ్ళిన ప్రతిసారీ కోకిలకి ఒళ్ళు మండుకొస్తుంది. "బుద్ధి జ్ఞానం లేని మూర్ఖుల్లారా! విద్యకన్నా చక్కని, బుద్ధిమంతురాలైన, ఒద్దికగా కాపురం చేసే అమ్మాయి మీకు ఎక్కడ దొరుకుతుంది? అందమట అందం..! అందం అంటే అసలు అర్ధం ఏమిటో తెలుసా మీకు?" లోలోపల అగ్ని పర్వతంలా దహించుకుపోయేది. చూసి చూసి వేసారి పోయి తను చస్తే గానీ అక్కయ్యకి పెళ్ళికాదని నిర్ణయానికి వచ్చింది కోకిల. మనసు భారమయ్యింది. వెళ్ళి అద్దం ముందు నిలబడింది.

అందంగా ఆకర్షణీయంగా కనిపించిన తన ప్రతిబింబాన్ని చూసి తనే అసహ్యించుకుంది. తన అందానికి పక్కన తేలిపోతున్న అక్కయ్యను తలుచుకున్న కొద్దీ ఆ అసహ్యం ఇంకా ఎక్కువయ్యింది. డ్రెస్సింగ్ టేబుల్ డ్రాయర్నిలాగింది. చిన్న బాటిల్ని తీసి జాకెట్లో దాచింది.

పెరటి వైపు వెళ్ళింది. నిండుగా వ్యాపించిన పాలవెన్నెల.

కొబ్బరాకుల సందుల్లో నుంచి దాగుడు మూతలాడుతున్న చంద్రుడిని చూడగానే ఆమె కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి. ఇదే వెన్నెల క్రింద తనకి భర్తగా రాబోయే, ముఖమెరగని ఆ రాకుమారుడితో సిగ్గు దొంతరల మధ్య తను గడపబోయే మధురమైన రాత్రుల గురించి తను కన్న కలలు కళ్ళముందు కదలాడాయి. ఏడుపు ముంచుకొచ్చింది. బాటిల్ని తెరిచింది.

"కోకిలా!"

బాటిల్ క్రిందపడి చెల్లాచెదురయ్యింది.

"అప్పుడే అనుకున్నాను. పొద్దున్న లేచినప్పటినుంచి పిచ్చి చూపులు చూస్తూ, ఇంటిపనులను సవ్యంగా ముగించకుండా కిలగాపులగం చేసినప్పుడే అనుకున్నాను ఇలాంటి పిచ్చి పని ఏదైనా చేస్తావేమోనని. కళ్ళల్లో వత్తులు వేసుకుని నిన్నే గమనిస్తున్నాను."

"అక్కా! దయచేసి నన్ను వదిలెయ్యి అడ్డుపడకు." వెక్కిళ్ళ మధ్య అంది కోకిల. "నా వల్ల ఎంత మందికి కష్టం?"

"పిచ్చిదానిలా మాట్లాడకు. నీ వల్ల ఎవరికి కష్టం? ఆడదాన్ని భోగం వస్తువుగా తప్ప వేరే విధంగా చూడడం తెలియని కామపిశాచాలతో, స్త్రీ జాతినే కించపరచే మూర్ఖులతో నా జీవితం ముడిపడకుండా ముందుగానే వాళ్ళను గుర్తించడంలో నాకు ఎంతో సహాయం చేస్తున్నావు. భార్యని సాటి ప్రాణిగా, మంచి స్నేహితురాలిగా చూడగలిగే ఒక మంచి మనిషి కోసం నేను ఎదురు చూస్తున్నాను." దృఢంగా అంది విద్య.

కోకిల మనస్సులో కమ్ముకున్న మేఘాలు మెల్లగా తొలిగిపోయాయి. "అక్కా!" విద్య భుజం మీద తలదాచుకుంటూ ఆశ్రయం దొరికినట్లుగా కళ్ళు మూసుకుంది కోకిల.

మూలకథా రచయిత్రి తిలకవతి గారు తమిళనాడులో ఐ.పి.ఎస్ ఆఫీసర్. ఆమె వ్రాసిన 'కల్మరం' అనే నవలకి 2005 సంవత్సరంలో కేంద్ర సాహిత్య ఎకాడెమీ అవార్డు లభించింది.



చెన్నై వాస్తవ్యులైన గౌరిగారు తెలుగు నుంచీ తమిళంలోకీ, తమిళంనుంచీ తెలుగులోకీ అనేక కథలూ, నవలలూ అనువాదం చేసారు. వీరి అనువాదాలు తెలుగు-తమిళ భాషలలోని అన్ని ప్రముఖ పత్రికలలోనూ ప్రచురించ బడుతున్నాయి.